

# ఉద్యోగం

"అయితే నువ్వేనన్నమాట మోహన్‌రావ్" ఎదురుగా వున్న వ్యక్తిని పరిశీలనగా చూస్తూ అన్నాడు శివ కుమార్.

"అవును సార్. డిగ్రీ పాసయ్యాను" వినయంగా చెప్పాడు మోహన్.

శివకుమార్ ఓ పెద్ద కంపెనీలో అకౌంట్స్ మేనేజర్. గత రెండు వారాలుగా ఓ దూరపు బంధువు తన కొడుకుకు 'మీ కంపెనీలో ఏదన్నా చిన్న ఉద్యోగం' అని వేధిస్తుంటే ఈ రోజు అతన్ని పంపమని చెప్పాడు.

"డిగ్రీ పాసై రెండేళ్ళు ఖాళీగా ఎందుకున్నావ్? ప్రైవేటుగా పి.జి. కోర్సు చదవచ్చు కదా!" సర్టిఫికెట్స్ పరిశీలనగా చూస్తూ అన్నాడు శివకుమార్.

"ఉద్యోగం కోసం తీవ్రంగా వెదకడంలో చదవ లేదు సర్" వినయంగా జవాబిచ్చాడు మోహన్.

"సరే. మా కంపెనీలో చిన్న పోస్ట్ నీ కోసమే క్రియేట్ చేయించి, నిన్ను అపాయింట్ చేయిస్తాను. చాలా చిన్న జాబ్. జీతం కూడా మూడు వందలే. అయితే, బాగా పనిచేయాలి" ఆలోచనగా అన్నాడు శివకుమార్.

"వద్దు సార్." ఠక్కున అన్నాడు మోహన్.

"ఎందుకు? ఏదో ఒకటి. సమ్‌థింగ్ ఈజ్ బెటర్ దాన్ నథింగ్!" ఆశ్చర్యపోయాడు శివ కుమార్.

"మరి మూడు వందలే అంటే ఎలా సర్? నా పోస్టల్ ఆర్డర్లకు, డి.డి.లకు కూడా సరిపోదు" నిరాశగా చెప్పాడు మోహన్.

అదీ నిజమే నన్పించింది.

"సరే. నెల క్రితమే టైపిస్ట్ పోస్ట్ ఖాళీ అయింది. ఆ పోస్ట్‌కు టైప్‌రైటింగ్ హయ్యర్ ప్లస్ వన్ ఇయర్ ఎక్స్‌పీరియన్స్ కావాలి. కాని, నువ్వు టైపు లోయరే ఎలా?" సాలోచనగా అన్నాడు శివకుమార్.

బదులు చెప్పకుండా టేబుల్ వంక చూడ సాగాడు మోహన్.

"సరే. నా తిప్పలేవో నేను పడతాను. మరో వారం రోజుల్లో నీకు ఇంటర్వ్యూ లెటర్ పంపిస్తాను. నాకు మా కంపెనీ ఛైర్మన్‌తో బాగా పరిచయం. ఏదో చెబుతానులే!

జీతం తొమ్మిది వందలు." తను ఉద్యోగం కోసం డిగ్రీ పాసయ్యాక ఎన్ని కష్టాలు పడ్డాడో గుర్తుచేసు కుంటూ చెప్పాడు.

"వద్దులెండి సర్!"

ఈసారి మరింత ఆశ్చర్యపోయాడు శివ కుమార్. మూడు వందల జీతం మరీ తక్కువ అంటే ఏవో తిప్పలుపడి టైపిస్ట్ పోస్ట్ వేయిస్తా నంటే కూడా వద్దంటే?

"ఎందుకు?" ఆశ్చర్యం నుంచి తేరుకుంటూ అడిగాడు.

"తొమ్మిది వందలు మరీ బొటాబొటిగా సరి పోతుంది సర్. రూమ్ రెంట్ నూరు, భోజనానికి నాలుగు వందలు, టిఫిన్, కాఫీలకు రెండు వందలు పోతే మా ఇంటికి ఏం పంపాలి?" నిరాశగా చెప్పాడు మోహన్.

ఒళ్ళు మండింది. పని చేయకుండా వేలు వేలు జీతం కావాలి.

"సరే. మా కంపెనీలో మేనేజర్ పోస్ట్ వుంది. మూడు వేలు జీతం. చేరతావా!" వ్యంగ్యంగా అడి గాడు.

"వద్దులెండి సర్. అంత జీతం ఇస్తున్నారంటే 24 గంటలూ పని చేయిస్తారు" అన్నాడు మోహన్.

— ఎన్.బి.షమా భారతి




యండమూరి వీరేంద్రనాథ్

సారథ్యంలో

ఊపిరి పోసుకుంటోంది

మీ ఊహలకి

అందనంత

అద్భుతంగా!

హారిక

సంపూర్ణ కుటుంబ వారపత్రిక

నాని పబ్లికేషన్స్

36-584/H, హిమాయత్‌నగర్, హైదరాబాదు-29 (ఫోన్: 65760)